క్లుప్తంగా

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



నెరుడుప్పలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ, బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ అన్నారు. వారు శుక్రవారం మండలంలోని పిల్లిగుండ్ల, నెరుడుప్పల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత జగనన్న పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. నాయకులు బందెన వాజ్, రవికుమార్ నాయుడు, దొర బాబు, కాశీ రెడ్డి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్, ఎంపీపీ లక్ష్మీదేవి, సర్పంచ్ విరుపాక్షిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం ఆమె కోడలు సాహితి శుక్రవారం 29వ వార్డులో కౌన్సిలర్ రజిత, వార్డు ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ హామీలు నమ్మి మోసపోవద్దని సూచించారు. సంక్షేమ సారథి సీఎం జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న హిరణ్మయి రెడ్డి

ఆదోని టౌన్: అభివృద్ధి, సంక్షేమ ఫథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పరిసముల్లా వీధిలో మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి హిరణ్మయిరెడ్డి, ఎమ్మెల్యే కుమార్తె గౌతమిరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. జగనన్నను గెలిపించుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఓటర్లకు వివరిస్తూ ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో సెబ్ సీఐ మహబూబ్ బాషా

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి.. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె, పెసలదిన్నె, టీఎస్ కుల్లురు గ్రామాలకు చెందిన బోయ నాగేంద్ర, గోపాల్, నరసప్ప బైక్‌పై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుడంగా పట్టుకున్నట్లు చెప్పారు. రాయచూర్ జిల్లా తలమారి గ్రామం నుంచి మద్యం తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. 384 జాన్స్ ఒరిజినల్ చాయస్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కోసిగి: మండల పరిధిలోని గ్రామాల్లో రోడ్ వాచ్ నిర్వహిస్తుండగా లక్ష్మీనగర్ క్యాంప్ వద్ద బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. నిందితుడు వందగల్లుకు చెందిన నాడుగేని వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని 6 బాక్సుల (576 టెట్రా ప్యాకెట్లు) కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను మరోసారి గెలిపించుకుందాం

ఎమ్మిగనూరురూరల్/గోనెగండ్ల: ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందించి సంక్షేమ ప్రదాతగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె గురువారం పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్‌తో కలిసి మండల పరిధిలోని బనవాసి, మల్కాపురం గ్రామాల్లో, గోనెగండ్ల మండలంలోని బి.అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. న్యూ బనవాసి గ్రామం ఎస్సీ కాలనీలో మహిళలు నవరత్నాల పథకాలను ముద్రించిఉన్న చీరలను కట్టుకొని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ.. మాటతప్పని, మడమ తిప్పని నేత సీఎం జగన్ ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేసి తీరతారన్నారు. అన్ని రాష్ట్రాల సంక్షేమ పథకాలను కాపీ కొట్టి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన కిచిడీ మేనిఫెస్టోను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఇచ్చిన హామీలను అమలుచేసినట్లు చంద్రబాబు చరిత్రలోనే లేదని గుర్తుచేశారు. మంచి చేసిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

ఆడబిడ్డకు అండగా నిలుద్దాం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, బీసీ మహిళకు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

చంద్రబాబు హామీలు నమ్మి మోసపోవద్దు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు చెప్పే బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ ప్రజలకు సూచించారు. సీఎం జగన్ పేదప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేస్తున్నారని హేళన చేసిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే జగన్ కంటే ఎక్కువ పథకాలను అమలు చేస్తానని చెబుతుండడం చూస్తే ఎంత మోసగాడో తెలుస్తుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగనన్నను సీఎంను చేసుకుందామన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచులు లక్ష్మీదేవి, దేవేంద్రగౌడ్, ఎంపీటీసీ ధనుంజయ్, నాయకులు భీమిరెడ్డి, నల్లారెడ్డి, పెద్దయ్య, ప్రతాప్‌రెడ్డి, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బనవాసిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఘనస్వాగతం పలికిన నాయకులు

ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి, నాయకులకు ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలలతో ఘనస్వాగతం పలికారు. దారి పొడవునా పూలుచల్లుతూ స్వాగతం పలికారు. మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బందెనవాజ్, జైపాల్ రెడ్డి, నాగిరెడ్డి, గిరిశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, బజారి, శివ్ భూషన్ రెడ్డి, పాండు రంగ రెడ్డి, రాజాగోపాల్ రెడ్డి, తిరుమల రెడ్డి, రాముడు, మహేష్ రెడ్డి, మాణిక్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో బీజేపీ నుంచి వీరసేనతో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 20 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, బుట్టా శివనీలకంఠ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ గ్రామానికి 300 మందికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎమ్మిగనూరు మండలం మల్కాపురం నుంచి బీజేపీ నాయకులు తలారి గోపాలు, పేట కేశన్నతో పాటు వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు.



ప్రచారంలో చిన్నారిని లాలిస్తున్న బుట్టా రేణుక



బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మల్కాపురం టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన నాగలదిన్నె గ్రామ మహిళలతో బుట్టా రేణుక

67 మంది వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 67 మంది వార్డు వలంటీర్లు శుక్రవారం విధులకు రాజీనామా చేశారు. అధికారులు వారి రాజీనామాలను ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి పంపారు. మున్సిపాలిటీలో 3వ వార్డులో 11 మంది, 7వ వార్డులో - 11, 14వ వార్డు - 1, 2వ వార్డు -8, 25వ వార్డు -10, 11వ వార్డు - 3, 39వ వార్డు -2, 12వ వార్డు- 5, 9వ వార్డు - 5, 1వ వార్డు -9, 36వ వార్డు - 1, 4వ వార్డులో ఒకరు రాజీనామా చేశారు.

ఆదోని రూరల్: మండలంలో 24 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, ఈఓపీఆర్‌డీ నాగరాజులకు అందజేశారు. మండలంలోని పెద్దహరివాణం సచివాలయం-1 పరిధిలో ఐదుగురు, పెద్దహరివాణం-2 పరిధిలో ముగ్గురు, చిన్నపెండేకల్‌లో నలుగురు, బసాపురంలో ఇద్దరు, గణేకల్‌లో ఒకరు, పెద్దతుంబళంలో ఒకరు, జాలిమంచిలో 8 మంది రాజీనామాలు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సురక్ష శిబిరానికి విశేష స్పందన

కోసిగి: ఎండతీవ్రత, వడగాడ్పుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోసిగి ప్రాథమిక వైద్యాధికారిణి రజిత సూచించారు. ఆమె శుక్రవారం కోసిగి సచివాలయం-1 పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక భాగంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 503 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరుగురు గర్భిణులకు పరీక్షలు చేసి ఆదోనికి రెఫర్ చేశారు. అలాగే కంటి పొర లోపం ఉన్న 15 మందికి పరీక్షలు చేసి కళ్లద్దాలకు రెఫర్ చేయించారు. ఉచితంగా మందులు అందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు-1లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 70 మంది వైద్య సేవలందుకున్నట్లు అధికారులు తెలిపారు. అందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చంద్రబాబుకు ముసలోళ్ల ఉసురు తప్పదు



రాంపురంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పల్లెపాడు టీడీపీ కార్యకర్తలు

మంత్రాలయం: పింఛన్ల విషయంలో చంద్రబాబు నీచంగా వ్యవహరించారని, ఆయనకు ముసలోళ్ల ఉసురు తప్పదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మంత్రాలయం మండలం కల్లుదేవకుంట, చిలకలడోణ, బూదూరు, వి.తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్లపై అక్కసుతో నిత్యం విషం కక్కుతూ ఎలక్షన్ కోడ్‌ను అడ్డం పెట్టుకుని పింఛన్ల పంపిణీకి ఆటంకం తెచ్చాడని మండిపడ్డారు. పచ్చ పత్రికలు నిజాన్ని దాచి నిస్సిగ్గుగా తప్పును సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై నెట్టడం విచారకరమన్నారు. చంద్రబాబు లాంటి వ్యక్తిని వెనకేసుకుని రావడం దారుణమన్నారు. పింఛన్ కోసం మండుటెండలో అవస్థలు పడుతూ వెళ్లి పలువురు వృద్ధులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి మరణానికి ముమ్మాటికి చంద్రబాబే కారణమి దుయ్యబట్టారు. జగనన్నకు వస్తున్న ఆదరణను భరించలేక ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నాడని విమర్శించారు. జరగబోయే ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమన్నారు. టీడీపీ నేతల బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో నియోజకవర్గంలో 6 ఎత్తిపోతల పథకాలు చేపట్టినట్లు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విఖ్యాత రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరిక

కోసిగి: మండల పరిధిలో టీడీపీకి కంచుకోటగా ఉన్న పల్లెపాడు గ్రామం నుంచి 25 కుటుంబాల వారు శుక్రవారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. రాంపురంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో గ్రామ నాయకుడు లంకారెడ్డి ఆధ్వర్యంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరగా పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రికల్లో ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాగరాజ్ గౌడ్

కౌతాళం: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లదచారి, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. వారు శుక్రవారం కౌతాళంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారంలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. హనుమన్‌నగర్, పింజారిగేరి, వడ్డెగేరి, కబ్బెరు వీదుల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. అలాగే ఉరుకుంద గ్రామంలో ఈరన్నస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటువేసి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. నాయకులు అబ్దుల్‌సమద్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



కౌతాళంలో ప్రచారం చేస్తున్న ప్రహ్లదచారి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామానికి చెందిన దిద్ది వీరేష్‌తో పాటు ఐదు కుటుంబాలు ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ నాయకుడు నాగరాజ్‌గౌడ్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి కుట్ర



ప్రచారం చేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల రిజర్వేషన్లకు ఎసరు పెట్టిన బీజేపీతో జతకట్టిన టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, కౌన్సిలర్ ఖాశింబేగ్ పిలుపునిచ్చారు. వారు శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో ప్రాంతంలో నమాజు అనంతరం ముస్లింలను కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుకకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే రాబోవు రోజుల్లో ముస్లింల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారన్నారు. ముస్లింల రిజర్వేషన్లపై కూటమి కుట్రలు వివరించారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు, అమలుచేయలేని మ్యానిఫెస్టోను నమ్మవద్దని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, హాజీ వహబ్, జిల్లా ప్రచార కార్యదర్శి సయ్యద్ చాంద్, ఖిబులా హుసేన్, కొండాపురి రహమతుల్లా, అబ్రార్, తదితరులు పాల్గొన్నారు.

పండుటాకుల ప్రాణాలతో చెలగాటం



ఎమ్మిగనూరు బ్యాంకులో నగదు కోసం క్యూలో వృద్ధులు



కౌతాళంలో పాస్‌బుక్‌లను వరుసలో ఉంచి వేచి ఉన్న పింఛన్‌దారులు

సాక్షి నెట్‌వర్క్: పింఛన్ నగదు కోసం శుక్రవారం పట్టణంతో పాటు గ్రామాల నుంచి ఆపసోపాలు పడుతూ వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకులకు వచ్చారు. చేత కర్రలు పట్టుకొని కొందరు, సహాయకులతో కొందరు, ఆటోల్లో మరికొందరు వ్యయప్రయాసాలకోర్చి బ్యాంకులకు చేరుకుని వేచిఉండి తమ వంతు వచ్చినప్పుడు నగదు అందుకున్నారు. మండు వేసవిలో తాగేందుకు నీరు లేక, నిలువ నీడ లేక అల్లాడిపోయారు. నిప్పులు కక్కుతున్న ఎండకు తాళలేక కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. తమకు ఈ అవస్థలు తెచ్చిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును దుమ్మెత్తిపోస్తూ శాపనార్థాలు పెట్టారు. వృద్ధులపై పగ సాధించిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.



కోసిగిలో బ్యాంకు మెట్లు ఎక్కలేక కూలబడిన వృద్ధురాలు

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



కడిమెట్ల నుంచి ఆటోలో ఎమ్మిగనూరుకు వచ్చా. ఇక్కడ బ్యాంకు వద్ద పింఛన్ల కోసం వచ్చినోళ్లు చానా మంది ఉన్నారు. మధ్యాహ్నమైనా పింఛన్ చేతికి అందలేదు. ఈ పరిస్థితి తెచ్చిన చంద్రబాబుకు ముసులొల్ల ఉసురు తగులుతుంది.

– హనుమక్క, కడిమెట్ల గ్రామం

దిక్కు తోచడం లేదు



ప్రతి నెలా వలంటీరు వచ్చి పింఛన్ చేతికి ఇస్తుండే. పోయిన నెల సచివాలయంలో పింఛన్ ఇచ్చారు. ఈ నెల అలాగే ఇస్తారనుకుంటే బ్యాంకులో జమ చేశారని సారొళ్లు చెప్పారు. నాకు బ్యాంకు ఖాతా కూడా లేదు. ఎట్లా చేయాలో.. దిక్కు తోచడం లేదు. పింఛన్ సొమ్ముతో మందులు, మాకులు కొనుక్కుంటాను. ఎలాగైనా పింఛన్ ఇంటికి తెచ్చివండి సారో

– కురువ యంకమ్మ, వృద్ధురాలు

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



జాలవాడిలో ప్రచారం చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం: ప్రజాసంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామంలో పర్యటించారు. గడప గడపకు వెళ్లి గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ప్రతిఒక్కరికీ మేలు చేసిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు మల్లమ్మ, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వైఎస్ సర్పంచు అమినాబి, తదితరులు పాల్గొన్నారు.

రేపు కేంద్ర మంత్రి రాక

ఆదోని అర్బన్: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదోనికి వస్తున్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. ప్రచార రథం ద్వారా రోడ్ షో నిర్వహిస్తారు. ఆర్ట్స్ కళాశాల నుంచి తిక్కస్వామి దర్గా మీదుగా భీమాస్ సర్కిల్ నుంచి కోట్ల కూడలికి చేరుకుని బహిరంగ సభ నిర్వహిస్తారు. అక్కడి నుంచి పాత బస్టాండు మీదుగా ఏరియా ఆస్పత్రి వరకు రోడ్ షో నిర్వహిస్తారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి తరపున ప్రచారం చేపట్టనున్నారు.

విద్యుత్ వైర్ల అపహరణ

కోసిగి: మండల కేంద్రానికి తాగునీటిని అందించేందుకు పులికనుమ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన 5 బోర్లకు విద్యుత్ వైర్లను కత్తిరించి దండగులు దొంగలించినట్లు సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం వాటర్‌మెన్ మోటార్లు ఆన్ చేసేందుకు వెళ్లగా చోరీ జరిగిన విషయం తెలిసింది. 200 మీటర్ల విద్యుత్ వైర్లు, ఒక స్టాటర్ బాక్స్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.30 వేలు ఉంటుందని తెలిపారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా మధ్యాహ్నం లోగా కొత్త వైర్లు తెచ్చి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెబుదాం

కోసిగి: పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేసి అవ్వాతాతలను అవస్థలకు గురిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెబుదామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కోసిగిలో నాగన్న, గేరి, కొండుగాని వీధి, దుర్నిగేని వీధి, కుమ్మరి వీధి, పెద్దమసీదు వీధి, పాత పోస్టాఫీసు రోడ్డు, తేరుబజారు దుకాణాల వద్ద ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. మెయిన్ రోడ్డులో బీసీ పాయింట్ వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న అవ్వతాతలను పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నారు. సీఎం జగనన్న 58 నెలలుగా ఇంటి వద్దకే పింఛన్లు అందించారని, దీన్ని ఓర్వలేని చంద్రబాబు ఎలక్షన్ కోడ్‌ను అడ్డం పెట్టుకుని కుట్రలు పన్నాడన్నారు. వృద్ధులు, దివ్యాంగులను కష్టాలు పెట్టిన చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుని ఇంటి వద్దకే పింఛన్ వచ్చేలా చేసుకుందామని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, బుళ్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



పింఛన్‌దారుల కష్టాలు తెలుసుకుంటున్న పి.మురళీమోహన్ రెడ్డి

జగనన్నతోనే బంగారు భవిష్యత్తు



కనకవీడులో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం కనకవీడు గ్రామంలో సర్పంచు మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం జగనన్న అని 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. 2014లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నేరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సంక్షేమాభివృద్ధితో పాట బంగారు భవిష్యత్తు కోసం మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, సుశీలమ్మ, వెంకటరాముడు, హరిచంద్ర, పెద్ద ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



గోనెగండ్లలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం తథ్యం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం గోనెగండ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు మురళీనాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరికీ అండగా నిలిచారన్నారు. అధికారం కోసం ప్రతిపక్ష నేత చంద్రబాబు మోసపూరిత హామీలు ప్రకటిస్తున్నారని, ప్రజలు నమ్మవద్దని సూచించారు. సీఎం జగనన్న హామీ ఇస్తే కచ్చితంగా నేరవేరుస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందని, మరోసారి సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో అన్ని స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ్య, జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, కృష్ణమూర్తి నాయుడు, నదిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలో వివరాల నమోదు

ఆదోని రూరల్: ఈవీఎం, వీవీ ప్యాట్ కంట్రోల్ యూనిట్‌లో అభ్యర్థులు, గుర్తుల వివరాలు నమోదు చేస్తున్నట్లు ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ హాల్‌లో ఆర్వో ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో సాంకేతిక నిపుణులతో ఆదోని అసెంబ్లీకి సంబంధించి ఈవీఎం కమిషనింగ్ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సిబ్బంది ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కి చెందిన ఇంజినీర్లు ఈవీఎం కమిషనింగ్, కంట్రోల్ యూనిట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, డీటీలు రామేశ్వరరెడ్డి, రుద్రగౌడ్, ఈఎంపీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, సెక్టోరల్ అధికారులు, పాల్గొన్నారు.



వివరాల నమోదును పరిశీలిస్తున్న ఆర్‌ఓ శివనారాయణశర్మ